సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 3 । మార్చి । 2025



సోమశిలలో 58.6 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 58.603 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 3680 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.87,650
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,940
3 శాతం జీఎస్టీతో	రూ.8,178
నవర (8 గ్రా)	రూ.65,424

గరిష్టం/కనిష్టం
34.3 /25.0

వాతావరణం

జిల్లాలో వాతావరణం సోమవారం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 63 శాతంగా ఆదివారం నమోదైంది.



ఇఫ్తార్ | సహర్
సోమవారం | మంగళవారం
సా: 6.19 | ఉ: 5.05

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

హైలెవల్ కాలువను వెంటనే నిర్మించాలి



మాట్లాడుతున్న నేతలు

మర్రిపాడు: సోమశిల హైలెవల్ కెనాల్‌ను వెంటనే పూర్తి చేయాలంటూ మర్రిపాడులో రైతు సదస్సును సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య మాట్లాడారు. మెట్ట ప్రాంత తాగు, సాగునీటి అవసరాల కోసం నిర్మించనున్న దీన్ని త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ప్రాజెక్ట్ పూర్తి చేసేలా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవ చూపాలని కోరారు. ఈ విషయమై నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడ్ని ఈ నెల ఐదున కలవనున్నామన్నారు. నేతలు మూలె వెంగయ్య, నాగయ్య, లక్కు ప్రసాద్, చంద్రా నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఏడు నెలల పాపతో తల్లి ఆత్మహత్యాయత్నం


- రక్షించిన పోలీసులు

నెల్లూరు(క్రైమ్): కుటుంబకలహాలతో మనస్తాపానికి గురైన వివాహిత తన ఏడు నెలల కుమార్తెతో కలిసి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు వీరిని రక్షించారు. వివరాలు.. చింతారెడ్డిపాళెనికి చెందిన నితిన్, జాస్మిన్ గతేడాది ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఏడు నెలల పాప ఉంది. కొంతకాలం సజావుగా సాగిన వీరి కాపురంలో కలతలు చోటుచేసుకున్నాయి. ఈ తరుణంలో జాస్మిన్ తన పాపతో కలిసి ఇంటి నుంచి శనివారం రాత్రి బయటకొచ్చారు. సౌత్ రైల్వేస్టేషన్ సమీపంలోని పట్టాల వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుండగా, అటుగా వెళ్తున్న హరీష్.. 112కు సమాచారం అందించారు. చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు ఆదేశాల మేరకు కానిస్టేబుళ్లు ప్రభు కిరణ్, పుల్లయ్య హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని తల్లీకుమార్తెను రక్షించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వివరాలు సేకరించి ఆమె కుటుంబసభ్యులకు సమాచారాన్ని ఇన్‌స్పెక్టర్ అందించారు. అనంతరం నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు పంపారు. బాధితురాలి కుటుంబసభ్యులకు రూరల్ ఇన్‌స్పెక్టర్ వేణు కౌన్సెలింగ్ చేసి వీరిని అప్పగించారు.

నమ్మకానికి సంకెళ్లు

➡ స్వస్థత కోసం ఏఎస్‌పేట దర్గాకు మతిస్థిమితం లేని వారు

దక్షిణాది రాష్ట్రాల్లో సుప్రసిద్ధమైన దర్గాల్లో ఏఎస్‌పేటలోని హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గా ఒకటి. దీని దర్శనార్థం దేశ, విదేశాలకు చెందిన ఎంతో మంది భక్తులు వస్తుంటారు. స్వస్థత నిమిత్తం మతిస్థిమితం లేని వారిని ఇక్కడికి తీసుకొస్తే ఆ సమస్య నయమవుతుందనేది ప్రగాఢ విశ్వాసం. ఈ నమ్మకంతో పలువుర్ని ఈ ప్రాంతంలో వదిలేసి కుటుంబసభ్యులు వెళ్తుంటారు. ఈ అవకాశాన్నే సంరక్షకులు చక్కగా క్యాష్ చేసుకుంటున్నారు. మానసిక వ్యాధిగ్రస్తులను చైన్లతో కట్టి.. వేధింపులకు పాల్పడుతూ అమానవీయంగా వ్యవహరిస్తున్నారు. మరోవైపు పర్యవేక్షణలేక కొందరు అటవీ ప్రాంతంవైపు వెళ్లి మృత్యువాత పడుతున్న ఘటనలూ ఉన్నాయి.



గొలుసుతో అమానవీయంగా బంధించి



మస్తాన్



సోదరి

ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తులు నిజామాబాద్ జిల్లాకు చెందిన వారు. మానసిక రోగైన మస్తాన్‌ను కుటుంబసభ్యులు ఏఎస్‌పేటలోని ఓ కేర్ టేకర్ వద్ద మూడు నెలల క్రితం వదిలారు. ఆయనకు తోడుగా సోదరి ఉంటున్నారు. ఆమెపై కన్నేసిన కేర్ టేకర్ షరీఫ్ ఎలాగైనా లొంగదీసుకోవాలనే ఉద్దేశంతో మస్తాన్‌ను ఓ గదిలో మూడు రోజుల క్రితం బంధించి కొట్టారు. తనకు సహకరించకపోతే సోదరుడ్ని చంపేస్తానంటూ ఆమెను బెదిరించారు. అంతటితో ఆగకుండా గదిలోకి లాక్కెళ్లి చేయి చేసుకున్నారు. తప్పించుకున్న ఆమె.. ఏఎస్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో షరీఫ్‌పై మూడు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తులు కొద్ది నెలలుగా కేర్ టేకర్ షరీఫ్ వద్ద ఉంటున్నారు. వీళ్లను బేల్దారీ పనులకు పంపిస్తూ ఆదాయాన్ని గడిస్తున్నారు. మానసిక రోగులనే కనికరం లేకుండా కర్రతో కొడుతూ విక్కృతానందం పొందుతున్నారు. ఒక్కొక్కరికి నెలకు రూ.15 వేలను కుటుంబసభ్యుల వద్ద వసూలు చేస్తుంటారు. వీరిని వివిధ పనులకు పంపిస్తూ కూలి డబ్బులనూ కొల్లగొడుతున్నారు.

- అక్కడే వదిలేస్తున్న కుటుంబసభ్యులు
- చుట్టూ తిరిగితే వ్యాధి తగ్గుతుందనే నమ్మకం
- అవకాశాన్ని సొమ్ము చేసుకుంటున్న సంరక్షకులు
- చైన్లతో కట్టి.. ఆపై హింసిస్తూ..
- పర్యవేక్షణ లేక అటవీ ప్రాంతం వైపు వెళ్లి మృత్యువాత



ఓ ఇంట్లో మానసిక రోగులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఏఎస్‌పేటలోని హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గా భక్తుల విశ్వాసానికి ప్రతీక. దీన్ని దర్శించుకుంటే తమ మొక్కులు తీరుతాయనే నమ్మకం చాలా మందిలో బలంగా నాటుకుంది. మతిస్థిమితం లేని వారిని ఇక్కడ కొంతకాలం ఉంచితే నయమవుతుందనే భావనా ఉంది. దీంతో వీరిని ఇక్కడి సంరక్షణ కేంద్రాల్లో కుటుంబసభ్యులే వదిలేసి వెళ్తారు. వీరి సంరక్షణ నిమిత్తం ఒక్కో కేంద్రానికి ఒక్కో కేర్ టేకర్ ఉంటారు.

సంరక్షకులే.. భక్షకులు

కేర్ టేకర్ ముసుగులో మానసిక రోగులను సంరక్షకులు వేధింపులకు గురిచేస్తున్నారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. ఇటీవల ఓ మహిళపై కేర్ టేకర్ షరీఫ్ అఘాయిత్యానికి పాల్పడిన ఘటన పెద్ద దుమారమే రేపింది. ఇలాంటి ఘటనలు జరిగినా బయటి ప్రపంచానికి చెప్పుకోలేక మరింతగా కుంగిపోతున్నారు. ఏఎస్‌పేటలో దాదాపు ఐదుగురు కేర్ టేకర్లుండగా, ఒక్కో కేంద్రంలో 50 నుంచి 70 మంది వరకు మానసిక రోగులు ఉంటున్నారు.

నగదు ఇవ్వకపోతే.. గెంటివేతే

ఇక్కడ ఉండే వారికి నిత్యం అన్నం పెడతారు. చేయి చాస్తే దయార్థులిచ్చే చిల్లరతో టీ, కాఫీలు సేవిస్తుంటారు. వసతిగృహాల్లోని గదులు దుర్భరంగా దర్శనమిస్తాయి. పరిశుభ్రత కానరాదు. కాలకృత్యాలు తీర్చుకునే సమయంలోనూ సంకెళ్లు తీయని ఘటనలు ఉన్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. నెలవారీగా కుటుంబసభ్యుల నుంచి నగదును మాత్రం తెప్పించుకుంటారు. ఒకవేళ జాప్యం జరిగితే వసతిగృహం నుంచి గెంటేస్తారు.

నమ్మకమే.. గేట్ వే..!

ఏఎస్‌పేట దర్గాలో తిరిగే మానసిక రోగుల ఆరోగ్యం కుదుటపడిన ఉదంతాలూ చాలానే ఉన్నాయి. నెలల వ్యవధిలోనే సాధారణ స్థితికొచ్చి తిరిగి స్వస్థలాలకు వెళ్తుండటంతో ఇది మానసిక రోగులకు నిలయంగా మారింది. వైద్యం చేయించినా ప్రయోజనం లేకపోతే దర్గా పరిసర ప్రాంతాల్లో వదిలేస్తే దైవమే నయం చేస్తుందనే నమ్మకం ఉంది. దీంతో చాలా మందిని ఇక్కడ వదిలి వెళ్తుంటారు.

క్షుద్బాధతో మృత్యువాత

పేద మానసిక రోగులకు ప్రత్యేక వసతి గృహాల్లో స్థానం ఉండదు. దీంతో దేవుడిపై కుటుంబసభ్యులు భారమేసి బయటే వదిలి వెళ్తున్నారు. పర్యవేక్షణ లేక వీరు అడవిబాట పడుతున్నారు. అలా వెళ్లిన వారు రోజుల తరబడి అక్కడే ఉంటూ ఆకలితో అలమటించి, తాగునీరు దొరక్క మృత్యువాత పడుతున్న ఘటనలూ ఉన్నాయి. ఐదేళ్లలో ఈ తరహాలో దాదాపు పది మంది వరకు మృత్యువాత పడ్డారని తెలిసింది. ఇలాంటి ఘటనల్లో కుటుంబసభ్యులకు సమాచారమిచ్చే పరిస్థితీ ఉండదు. గుర్తుతెలియని మృతదేహాలుగా పోలీసులు కేసు నమోదు చేసి అక్కడే అంత్యక్రియలు చేయించాల్సి వస్తోంది.

చొరవ చూపితే హ్యాపీయే..

ఏఎస్‌పేట దర్గాలో మానసిక రోగుల కోసం ప్రత్యేక వసతి గృహాలను నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దర్గా ప్రస్తుతం వక్ఫ్ బోర్డు ఆధీనంలో ఉంది. దీని నిర్వహణపై ఎన్నో ఫిర్యాదులూ వెళ్లాయి. వసతుల ఏర్పాటులో నిర్లక్ష్యం వహిస్తున్న తీరును తప్పుబడుతున్నారు.

చూస్తే.. కన్నీరే..!

మానసిక రోగుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంటుంది. కాళ్లు, చేతులకు సంకెళ్లేసి వదిలేస్తారు. ఉదయం నుంచి రాత్రి వరకు వీటితోనే నడవాల్సి ఉంటుంది. వారికంటూ ప్రత్యేక చికిత్స ఉండదు. ఏఎస్‌పేట దర్గా పరిసర ప్రాంతాల్లో దాదాపు 300 మంది వరకు మానసిక రోగులున్నారు. వీరిలో ఎక్కువ మంది ప్రైవేట్ వ్యక్తులు ఏర్పాటు చేసిన వసతి గృహాల్లోనే ఉంటున్నారు. పర్యవేక్షకులు మాత్రం వీరిని సాటి మనుషులుగా పరిగణించరు. ఎదురుతిరిగితే కర్రతో చావబాదుతారు. దీంతో వీరి శరీరం నిండా దెబ్బలే కనిపిస్తాయి. భయపడి పర్యవేక్షకులు చెప్పిన విధంగా నడుచుకోవాల్సి వస్తోంది.

అరాచకాలకు అడ్డొస్తే కక్షసాధింపే

- ఎంపీటీసీ సభ్యుడి స్థల హద్దు కంచె తొలగింపు
- టీడీపీ ముఖ్యనేత ఆదేశాలకు అధికారుల జీహుజూర్
- మూడు తరాలుగా అక్కడే నివాసం ఉన్న కుటుంబం

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో టీడీపీ నేతల కక్షసాధింపులు పరాకాష్టకు చేరుకుంటున్నాయి. తమకు అడ్డొచ్చినా.. ప్రశ్నించినా తట్టుకోలేకపోతున్నారు. వీరిపై అధికారులను ఉసిగొల్పి ఇబ్బందులకు గురిచేయడం పరిపాటిగా మారింది.

నోటీసులివ్వకుండానే..

రూరల్ మండలంలోని ఆమంచర్ల బిట్ – 2 ఎంపీటీసీ సురేంద్రరెడ్డికి చెందిన స్థల హద్దు కంచెను ఎలాంటి నోటీసులివ్వకుండానే రెవెన్యూ అధికారులు తొలగించారు. వాస్తవానికి అప్పయ్యకండ్రిగలోని పడమర వీధిలో ఎంపీటీసీ చింతా సురేంద్రరెడ్డికి 50 అంకణాల స్థలం ఉంది. తాతల నాటి నుంచే ఇది సంక్రమించింది. అక్కడ దశాబ్దాలుగా ఉన్న చిన్న ఇల్లు పాతబడటంతో కొన్నేళ్ల క్రితం తొలగించారు. స్థలం ప్రస్తుతం ఖాళీగా ఉండటంతో చుట్టూ కంచె వేశారు.

పచ్చ నేతల సూచనలతోనే..

స్థలం వద్దకు స్థానిక సర్వేయర్, వీఆర్వో శనివారం చేరుకొని, టీడీపీ నేత వేణుకు సంబంధించిన జేసీబీని తీసుకొచ్చారు. రూరల్‌లోని ఓ టీడీపీ ముఖ్యనేత ఆదేశాలతో స్థలం చుట్టూ ఉండే కంచెను తొలగించేందుకు సిద్ధమయ్యారు. ఎంపీటీసీ కుమారుడు మస్తాన్‌రెడ్డి అక్కడికి చేరుకొని అడ్డుకున్నారు. ఎందుకు తొలగిస్తున్నారని ప్రశ్నించగా, తామేమీ చేయలేమని, టీడీపీ పెద్దల సూచనలతోనే వచ్చామని బదులిచ్చారు. అధికారుల తీరుపై స్థానికులు మండిపడ్డారు. వాగ్వాదం జరుగుతున్న సమయంలోనే కంచెను జేసీబీతో తొలగించారు. కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. కాగా పచ్చ నేతలను కలవాలని సూచించి, అధికారులు నిష్క్రమించారు.

బాధితులకు అండగా నిలిచినందుకే..

ఆమంచర్లలోని 23 కుటుంబాలకు సంబంధించిన భూమిని టీడీపీకి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించేందుకు యత్నించారు. ఈ వ్యవహారంలో పేదలకు ఎంపీటీసీ సభ్యుడు అండగా నిలిచారు. సమస్యను కలెక్టర్ దృష్టికీ తీసుకెళ్లారు. దీంతో కక్ష పెంచుకున్న వారు ఏదో రకంగా ఇబ్బంది పెట్టాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా పోరంబోకు స్థలమంటూ కంచె తొలగింపు చర్యలకు అధికారులు పూనుకున్నారు. ఇలా వ్యవహరించడం దారుణమని సురేంద్రరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.



జేసీబీతో కంచె తొలగింపు

భక్తిప్రపత్తులతో ఉపవాస దీక్షలు



ఇఫ్తార్ విందులో ముస్లింలు

నెల్లూరు(బృందావనం): పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైన నేపథ్యంలో ఉపవాస దీక్షలను ముస్లింలు ఆదివారం ప్రారంభించారు. వేకువజాము నుంచి సాయంత్రం వరకు ఉపవాస దీక్షను ఆచరించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం అల్పాహారాన్ని సాయంత్రం తీసుకున్నారు.

పెత్తనం నీదా.. నాదా..?

సైదాపురం మండలంలోని గనుల కోసం కూటమి నేతలు కొట్లాడుకుంటున్నారు. ప్రధానంగా శ్రీనివాసా పద్మావతి మైన్స్‌ను సొంత చేసుకునేందుకు ప్రచ్ఛన్న యుద్ధానికి తెరలేపారు. నెల్లూరుకు చెందిన ఓ ముఖ్యనేత ఆధిపత్యాన్ని సహించలేని స్థానిక ప్రజాప్రతినిధి మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే పోలీస్.. రెవెన్యూ అధికారులను ఆదివారం రంగంలోకి దించారు. అయితే సదరు ముఖ్యనేత జోక్యం చేసుకోవడంతో చేసేదిలేక చేతులెత్తేశారు. తూతూమంత్రంగా చర్యలు చేపట్టి ముఖం చాటేశారు.

శ్రీనివాసా పద్మావతి గని కోసం కూటమి నేతల ఘర్షణ

- సిండికేట్‌కు వ్యతిరేకంగా స్థానిక ప్రజాప్రతినిధి ఆదేశాలు
- ముఖ్యనేత జోక్యంతో తలలు పట్టుకుంటున్న అధికారులు



గనిలో పనిచేస్తున్న యంత్రం

సైదాపురం: మండలంలోని రామసాగరం, సైదాపురం గ్రామాలకు చెందిన ప్రభుత్వ భూమిని శ్రీనివాసా పద్మావతి గనికి గతంలో కేటాయించారు. 2019లోనే లీజు కాలపరిమితి ముగియడంతో అది కాస్తా మూతపడింది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వమొచ్చిన అనంతరం దానిపై పలువురు నేతల కన్నుపడింది. ఎలాంటి అనుమతుల్లేకుండా నెల్లూరుకు చెందిన టీడీపీ పెద్దల ఆధ్వర్యంలో మైనింగ్ ప్రారంభమైంది. ఈ క్రమంలో రామసాగరం గ్రామస్తులు కొందరు అక్రమ మైనింగ్‌ను ఆదివారం అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహించిన మైనింగ్ సిండికేట్‌కు చెందిన వ్యక్తులు తమకు అధికార పార్టీ ఎంపీ, మరో నాయకుడి మద్దతు ఉందంటూ గ్రామస్తులను బెదిరించి తరిమేశారు.

ప్రజాప్రతినిధి ఆగ్రహం

మైనింగ్ సిండికేట్ దౌర్జన్యాలపై రామసాగరం గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన వెంటనే ఫోన్ చేసి మైనింగ్ నిర్వాహకులపై చర్యలు చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. ఈ మేరకు మైన్ వద్దకు వచ్చిన పోలీసులు ఎనిమిది మోటార్‌సైకిళ్లు, ఓ ఎస్‌యూవీ వాహనాన్ని స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. తదనంతరం ఏమి జరిగిందో గానీ.. పోలీసులు సీజ్ చేసి వాహనాలు స్టేషన్ ఆవరణ నుంచి వెళ్లిపోయాయి. ఈ విషయం స్థానిక ప్రజాప్రతినిధికి తెలియడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వారి ఆదేశాల మేరకు తహసీల్దార్ రమాదేవి, ఎస్సై క్రాంతికుమార్ హుటాహుటిన శ్రీనివాసా పద్మావతి గని వద్దకు చేరుకొని, అక్రమ మైనింగ్‌పై విచారణ చేపట్టారు.

అనుమతులెలా..?

శ్రీనివాసా పద్మావతి గనిలో మైనింగ్ కోసం వచ్చిన దరఖాస్తును జనవరిలో తిరస్కరించారు. ఇంతలో ఏమైందో తెలియదు గానీ నెల గడవక ముందే సదరు గనిలో 1.5 లక్షల టన్నుల ఖనిజాన్ని తవ్వుకొని తరలించుకునేందుకు అనుమతులు మంజూరయ్యాయి. ఈ గనిపై కోర్టులో కేసు నడుస్తుండగానే అధికారులు పర్మిషన్ ఇవ్వడం గమనార్హం.

మైనింగ్‌కు అనుమతి లేదు

శ్రీనివాసా పద్మావతి గనిలో అక్రమ మైనింగ్‌పై ఫిర్యాదులొచ్చాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశీలించాం. ఇక్కడ కేవలం పంపింగ్‌ను మాత్రమే చేస్తున్నారు. ఖనిజాన్ని తరలించేందుకే అనుమతి ఉంది. మైనింగ్‌కు లేదు.

– రమాదేవి, తహసీల్దార్, సైదాపురం

ఫిర్యాదు అందలేదు

శ్రీనివాసా పద్మావతి గనిలో అక్రమ మైనింగ్‌పై ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు చేపడతాం. ఇక్కడ వాహనాలను స్వాధీనం చేసుకోలేదు. ఎవర్నీ అదుపులోకి తీసుకోలేదు.

– క్రాంతికుమార్, ఎస్సై, సైదాపురం



శ్రీనివాసా పద్మావతి గని ద్వారం

రిజిస్ట్రేషన్ చేసుకొని కూపన్ పొందాలి

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో వరి కోతకు సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకునేందుకు గానూ సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకొని కూపన్ పొందాల్సిందిగా రైతులకు జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. కూపన్ పరిమితి ఏడు రోజుల వరకు ఉంటుందని, ఆలస్యమైతే రీ షెడ్యూల్ చేసుకోవచ్చన్నారు.

చీఫ్ నిర్లక్ష్యం.. విద్యార్థికి సంకటం

- ఇంటర్ పరీక్షల్లో చేదు అనుభవం
- చదివింది సంస్కృతం.. కానీ హాల్‌టికెట్లో తెలుగుగా ముద్రణ
- అందులో ఏది ఉంటే అదే రాయాలని ఆదేశం
- చివరికి ఎగ్జామ్ రాయకుండానే వెనుదిరిగి

కందుకూరు రూరల్: కందుకూరులోని టీఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, పరీక్ష కేంద్ర చీఫ్ సూపరింటెండెంట్ నాగూర్‌వలీ నిర్లక్ష్యంతో ఓ విద్యార్థిని పరీక్ష రాయలేదు. ఉన్నతాధికారుల సూచనలను సైతం లెక్క చేయకుండా.. పరీక్షకు విద్యార్థినిని దూరం చేశారు.

జరిగిందిదీ..

టీఆర్‌ఆర్ జూనియర్ కళాశాల కేంద్రంలో ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు తెలుగు, సంస్కృతం, ఉర్దూ సబ్జెక్టులకు పరీక్షను జరపాలి. అయితే ప్రతిభ కళాశాలకు చెందిన ఇంద్రకంటి శరణ్య సంస్కృతాన్ని చదివినా, ఆమెకు ఇచ్చిన హాల్‌టికెట్లో తెలుగు సబ్జెక్టుగా ముద్రించారు. పరీక్ష కేంద్రంలోకి వెళ్లేంత వరకు ఈ అంశాన్ని విద్యార్థిని గమనించలేదు. తీరా తెలుగు ప్రశ్నపత్రాన్నిచ్చారు. అయితే తాను చదివింది సంస్కృతమని, ఆ ప్రశ్నపత్రాన్నే ఇవ్వాలని కోరారు. కాగా హాల్‌టికెట్లో ఏ సబ్జెక్టుంటే దాన్నే ఇస్తామని ఖరాఖండీగా చెప్పడంతో మూడు గంటల పాటు పరీక్ష రాయకుండా విద్యార్థిని కూర్చుండిపోయారు.

ఆదేశాలు బేఖాతర్

హాల్‌టికెట్లలోని సబ్జెక్టుల్లో ఏమైనా పొరపాట్లు జరిగి ఉంటే ముందే మార్చుకోవాలని ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు. ఒకవేళ పొరపాటు జరిగితే విద్యార్థి ఏ పరీక్ష రాస్తారో అదే ప్రశ్నపత్రాన్ని ఇవ్వాలని ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయినా చీఫ్ నాగూర్‌వలీ వీటిని ఏ మాత్రం పట్టించుకోకుండా విద్యార్థినిని పరీక్షకు దూరం చేశారు. కాగా ఈ అంశమై ఆర్‌ఐఓ శ్రీనివాసులును సంప్రదించగా, విద్యార్థినిని పరీక్ష రాయనీయకపోవడం పొరపాటేనని, దీనిపై విచారణ జరుపుతామని బదులిచ్చారు.

విద్యార్థినే తెలుగు పరీక్ష రాస్తానన్నారు

మా కాలేజీ వాళ్లు కావాలనే సంస్కృతం చదివించారు.. నాకు తెలుగు చదవడమంటేనే ఇష్టం.. ఇదే రాస్తానని విద్యార్థిని చెప్పడంతో ఆ ప్రశ్నపత్రాన్నే ఇచ్చాం. విద్యార్థి నుంచి ఎలాంటి ఫిర్యాదు రాలేదు.

– నాగూర్‌వలీ, ప్రిన్సిపల్, చీఫ్

హాల్‌టికెట్లో ఏది ఉంటే అదే రాయమన్నారు

హాల్‌టికెట్లో సంస్కృతానికి బదులు తెలుగు అని పొరపాటున పడింది. దాన్ని గమనించలేదు. సంస్కృత పరీక్ష రాస్తానంటే చీఫ్ అంగీకరించలేదు. హాల్‌టికెట్లో ఏది ఉంటే అదే రాయాలని చెప్పారు. నాకేమీ అర్థం కాక పరీక్ష రాయకుండా ఉండిపోయాను. లెటర్ కూడా రాసివ్వమని చెప్పలేదు.

– ఇంద్రకంటి శరణ్య, విద్యార్థిని

క్లుప్తంగా

6 నుంచి మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు

నెల్లూరు(అర్బన్): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 6వ తేదీ నుంచి మూడురోజులపాటు జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహిస్తామని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు తెలిపారు. నెల్లూరు దర్గామిట్టలోని ఎన్జీఓ భవన్‌లో ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని మహిళా విభాగం చైర్‌పర్సన్ ఉదయగిరి చిన్నమ్మ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెంచలరావు మాట్లాడుతూ పోటీలను ఏసీ స్టేడియంలో కలెక్టర్ ఆనంద్ ప్రారంభిస్తామన్నారు. మహిళా ఉద్యోగులు పాల్గొనేందుకు కలెక్టర్ రెండురోజులపాటు ప్రత్యేక అనుమతి ఇచ్చారన్నారు. 8న సెలవు మంజూరు చేశారన్నారు. ఈ మూడురోజులు ఉద్యోగులకు భోజనం, తాగునీరు ఇతర వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివారెడ్డి, విద్యాసాగర్‌లు ముఖ్య అతిథిలుగా విచ్చేస్తారన్నారు. ప్రతి సంవత్సరంలాగే ఈ పోటీలలో మహిళా ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి రామకృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్కాకుల పెంచలయ్య, ఇంకా ఆంజనేయవర్మ, ప్రసాద్‌రెడ్డి, కరుణమ్మ, కృష్ణంరాజు, సతీష్‌బాబు, రాజేంద్రప్రసాద్, విజయబాబు, కృష్ణకుమార్, సువర్ణ, స్వర్ణలత, నవోదయ, లక్ష్మి, జానకి, కిష్టమ్మ, సుమన తదితరులు పాల్గొన్నారు.

వర్చుసా లేఅవుట్ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

మనుబోలు: మండల పరిధిలోని కాగితాలపూరు క్రాస్‌రోడ్డు సమీపంలో జాతీయ రహదారి పక్కన వర్చుసా లేఅవుట్‌ను ఆదివారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చేతుల మీదుగా లేఅవుట్‌ను ప్రారంభించారు. సినీ హీరోయిన్లు నిధి అగర్వాల్, ఐశ్వర్య రాజేష్, జబర్దస్త్ కమెడియన్లు సందడి చేశారు. ఈ సందర్భంగా లేఅవుట్ యజమాని వెంకటేశ్వర్లు, జీఎం శివాజీ మాట్లాడుతూ హైవే పక్కనే అందరికీ అందుబాటులో లేఅవుట్‌ను తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. బస్సు సౌకర్యం, 300 మీటర్ల దూరంలో రైలు సౌకర్యాలున్నాయని తెలిపారు. లేఅవుట్‌లో విశాలమైన రోడ్లు, డ్రైయినేజీ, విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

నేడు ప్రత్యేక ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమం

కలువాయి: మండలంలోని మాదన్నగారిపల్లి సచివాలయంలో సోమవారం జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఆత్మకూరు ఆర్డీఓ అధ్యక్షతన ప్రత్యేక ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్యామ్‌సుందర్‌రాజు ఆదివారం తెలిపారు. రైతులు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

వృద్ధుడి ఆత్మహత్య


నెల్లూరు(క్రైమ్): అనారోగ్యమో మరే ఇతర కారణమో స్పష్టంగా తెలియదు గానీ ఓ వృద్ధుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. సంతపేటకు చెందిన సత్యనారాయణ (60), సుజాత దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. ఒకరు అమెరికాలో ఉండగా, మరొకరు ఇక్కడే ఉంటున్నారు. సత్యనారాయణ గతంలో కుదువ వ్యాపారం చేసేవాడు. రెండేళ్లుగా మతిస్థిమితం సక్రమంగా లేక ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. అప్పుడప్పుడు వచ్చి భార్యకు కనిపించేవాడు. శనివారం రాత్రి ఆయన సంతపేట సమీపంలో పురుగు మందు తాగాడు. చికిత్స నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సుజాత ఫిర్యాదు మేరకు సంతపేట ఎస్సై బాలకృష్ణ కేసు నమోదు చేశారు.

కండలేరులో 51.647 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 51.647 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 760, లోలెవల్ కాలువకు 110, హైలెవల్ కాలువకు 160, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి:	రూ.61
సన్నవి:	రూ.40
పండ్లు:	రూ.30

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్):	116
లేయర్ (లైవ్):	80
బ్రాయిలర్ చికెన్:	210
బ్రాయిలర్ స్కిన్‌లెస్:	230
లేయర్ చికెన్:	136

మంటలు చెలరేగితే.. బుగ్గే..

▶▶ ఇటీవల కావలి పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఓ వ్యక్తికి చెందిన పూరిల్లు దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగాయి. గ్యాస్ సిలిండర్ పేలిపోవడంతో మంటలు ఎగసిపడ్డాయి. ఆటో కొనుగోలు చేయడానికి అప్పుగా తెచ్చుకున్న రూ.1.5 లక్షల నగదు, 5 సవర్ల బంగారం పూర్తిగా కాలిపోయాయి. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. పూరిల్లు కాలిపోతోందని స్థానికులు అగ్నిమాపక శాఖ కార్యాలయానికి సమాచారమిచ్చారు. సిబ్బంది వచ్చి ఫైరింజిన్ మరమ్మతులకు గురైందని చెప్పడంతో బాధితులు, స్థానికులు నివ్వెరపోయారు.



కాలి బూడిదైన పూరిల్లు (ఫైల్)

▶▶ కొద్దిరోజుల క్రితం మర్రిపాడు మండలంలోని నందవరంలో ఓ పొగాకు బ్యారెన్ దగ్ధమైంది. క్యూరింగ్ కోసం ఏర్పాటు చేసిన పొగాకు కర్రలు జారిపడిపోవడంతో సాయంత్రం 5.30 గంటల సమయంలో ప్రమాదం జరిగింది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించినా రాత్రి 7.30 గంటలకు కూడా ఫైరింజిన్ ఘటనా స్థలానికి రాలేదు. సీఎం పర్యటన నేపథ్యంలో ఇక్కడి అగ్నిమాపక శకటాన్ని నెల్లూరుకు తరలించినట్లు చెబుతున్నారు. సుమారు రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లింది.



దగ్ధమవుతున్న పొగాకు బ్యారెన్

- అగ్నిమాపక శాఖను వేధిస్తున్న సిబ్బంది కొరత
- భారీ ప్రమాదాలు సంభవిస్తే అంతే సంగతులు
- అందుబాటులో 11 ఫైరింజిన్లు
- తరచూ మరమ్మతులకు గురవుతున్న వైనం
- ఆ శాఖలో కొన్ని పోస్టులు ఖాళీ



నెల్లూరులోని అగ్నిమాపక కేంద్రం

నెల్లూరు(క్రైమ్): ఎండలు ఉగ్రరూపం దాలుస్తున్నాయి. వేసవి పూర్తిగా రాకముందే భానుడు తన ప్రకోపాన్ని మెల్లమెల్లగా పెంచుతున్నాడు. అజాగ్రత్త, ఏమరపాటో, ఆకతాయిల చేష్టలు ఇలా కారణం ఏదైతేనేం ఏదో ఒకచోట నిప్పు రాజుకుంటూనే ఉంటోంది. ఆ సమయంలో ప్రతిక్షణం అమూల్యమైనదే. ఆలస్యమయ్యే కొద్దీ నష్టం పెరుగుతుంది. జిల్లాలో అవసరం మేరకు అగ్నిమాపక కేంద్రాల్లేక ప్రమాదాల నివారణ సవాలుగా మారుతోంది. కేంద్రాలున్న చోట కూడా సిబ్బంది కొరత వేధిస్తోంది. కొన్ని ప్రాంతాలు కేంద్రాలకు దూరంలో ఉండటంతో ఫైరింజిన్లు చేరుకునేలోగా బూడిద మిగులుతోంది.

తరచూ మరమ్మతులకు..

భానుడి భగభగలకు మానవ తప్పిదాలు తోడైతే పెను నష్టం వాటిల్లుతుంది. వేసవిలో అగ్నిప్రమాదాలు మరింత పెరిగే అవకాశం ఉంది. అగ్నిమాపక శాఖ అప్రమత్తంగా లేకపోతే ప్రజల ఆస్తులు, ప్రాణాలు బుగ్గిపాలు కావాల్సిందే. జిల్లాలో నెల్లూరు, కందుకూరు, కావలి, వింజమూరు, ఉదయగిరి, మర్రిపాడు, ఆత్మకూరు, రాపూరు, పొదలకూరుల్లో అగ్నిమాపక కేంద్రాలున్నాయి. స్టాండింగ్ ఫైర్ అడ్వైజరీ కౌన్సిల్ ప్రమాణాల మేరకు ప్రతి 50 వేల జనాభాకు ఒక ఫైరింజిన్ ఉండాలి. ప్రస్తుతం 11 మాత్రమే ఉండగా అందులో ఒకటి మరమ్మతులకు గురైంది. మినీ ఫైరింజిన్ మూలనపడింది. కొన్ని వాహనాలకు పూర్తిస్థాయిలో ఫిట్‌నెస్ లేకపోవడంతో తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో అగ్నిప్రమాదాలను సకాలంలో అరికట్టేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జనాభా పెరుగుదల, విస్తరిస్తున్న ప్రాంతాలతో ప్రమాద సమయంలో అగ్నిమాపక వాహనాలు సకాలంలో అక్కడకు చేరుకోలేక పోతుండటంతో ఆస్తి, ప్రాణనష్టం జరుగుతోంది.

తీవ్ర ఇబ్బందులు

జిల్లాలో అపార్ట్‌మెంట్లు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. వాటిల్లో కొన్ని నిబంధనలకు విరుద్ధంగా నిర్మించినవే. అపార్ట్‌మెంట్లలో సెట్‌బ్యాక్ లేకపోవడంతో ప్రమాదం జరిగితే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాస్తవానికి అగ్నిప్రమాదం జరిగినప్పుడు ఫైరింజిన్లు సులువుగా వెళ్లి మంటలను అదుపు చేసే పరిస్థితి ఉండాలి. అయితే అది చాలాచోట్ల లేదు. అలాగే గోదాముల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇంకా కొన్ని ప్రైవేట్ పాఠశాలలు, ఆస్పత్రులను బహుళ అంతస్తుల భవనాల్లో నిర్వహిస్తున్నారు. వీటిలో అధికశాతం ప్రమాద నివారణకు అవసరమైన పరికరాలు ఉంచడం లేదు. దీంతో ఆస్తితో పాటు ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంది.

సర్వం కాలిపోయి..

నెల్లూరు పరిసర ప్రాంతాల్లో ప్రమాదం చోటుచేసుకున్న సమయంలో నెల్లూరు అగ్నిమాపక కేంద్రం నుంచి అగ్నిమాపక శకటాలు వెళ్లి మంటలను ఆర్పుతున్నాయి. ముత్తుకూరు, వెంకటాచలం, ఇందుకూరుపేట, రాజుపాళెం, కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే 30 నిమిషాల నుంచి గంటపైగా సమయం పడుతుంది. దీంతో అనుకోని ఘటన జరిగితే ఫైరింజిన్లు అక్కడికి చేరుకునేలోపే సర్వం బుగ్గిపాలవుతోంది. కొండాపురం, వరికుంటపాడు తదితర ప్రాంతాల్లో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న ప్రాంతాలకు అనుగుణంగా మండలానికి ఒక అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు పంపారు. అత్యవసర ప్రాతిపదిక కింద నెల్లూరు రూరల్, బుచ్చిరెడ్డిపాళెంలో నూతన అగ్నిమాపక కేంద్రాల ఏర్పాటు, ఆత్మకూరు, ఉదయగిరి కేంద్రాల రెనోవేషన్, కావలిలో డబుల్ యూనిట్ పెట్టేందుకు చర్యలు చేపట్టారు. అవి కార్యరూపంలో ఉండగానే ఎన్నికలు రావడం, కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో ఆ ప్రక్రియ మందగించింది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ➡ గతంలో పూరిళ్లు, గడ్డివాములు అధికంగా అగ్నికి ఆహుతయ్యేవి. ఇప్పుడు ఎక్కువ ప్రమాదాలకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్, గ్యాస్ లీకేజీ తదితరాలు కారణాలుగా నిలుస్తున్నాయి.
- ➡ నివాసాలు, పొలాల గట్లపైన ఉన్న గడ్డివాముల చుట్టూ కంచె నిర్మించుకోవడం మంచిది. వీటికి సమీపంలో పొగతాగడం, చుట్ట, సిగరెట్, బీడీ వంటివి ఆర్పకుండా పారేయడం ప్రమాదకరం.
- ➡ ఎండుగడ్డిని ట్రాక్టర్లు, లారీల్లో రవాణా చేసే సమయంలో విద్యుత్ వైర్లకు తగలకుండా చూడాలి.
- ➡ రహదారి, కాలువగట్టు, నివాసాల పక్కన చెత్త వేయడం మంచిదికాదు. చెత్తకు నిప్పంటించడం ప్రమాదకరం. అది చుట్టుపక్కల వ్యాపించే అవకాశం ఉంటుంది.
- ➡ నాణ్యత కలిగిన విద్యుత్ వైర్లు, పరికరాలను మాత్రమే ఇళ్లు, దుకాణాల్లో వినియోగించుకోవాలి.
- ➡ ప్రమాదం సంభవించిన వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేసే ఆధునిక ఆపరేటింగ్ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలి.



అగ్నిమాపక వాహనాలు

ఖాళీలిలా..

అగ్నిమాపక శాఖలో సిబ్బంది కొరత వెంటాడుతోంది. జిల్లా కేంద్రంలో ఏడీఎఫ్ఓ, ఆరుగురు లీడింగ్ ఫైర్‌మెన్లు, ఐదు డ్రైవర్/ఆపరేటర్, 18 మంది ఫైర్‌మెన్స్, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో అగ్నిమాపక కేంద్రానికి ఎస్ఎఫ్ఓ, ముగ్గురు లీడింగ్ ఫైర్‌మెన్‌లు, ముగ్గురు డ్రైవర్/ఆపరేటర్, తొమ్మిది మంది ఫైర్‌మన్లుండాలి. జిల్లాలో 158 మంది సిబ్బందికి గానూ 35 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎనిమిది మంది ఫైర్ ఆఫీసర్లకు గానూ ఐదుగురు మాత్రమే ఉన్నారు. మర్రిపాడు, ఉదయగిరి, ఆత్మకూరుల్లో ఫైర్ ఆఫీసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 90 మంది ఫైర్‌మెన్లకు గానూ 58 మంది మాత్రమే ఉన్నారు. వారి స్థానంలో హోంగార్డులను వినియోగిస్తున్నారు. అయితే వారూ సరిపడనంతా లేకపోవడంతో ఉన్నవారిపైనే పనిభారం పడుతోంది.

ఎల్ఐసీలో పాలసీదారులకు నూరుశాతం భద్రత



ఏజెంట్‌ను సన్మానించిన ఎల్ఐసీ అధికారులు

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వ రంగంలో నడుస్తున్న అతిపెద్ద బీమా సంస్థ ఎల్ఐసీలో పాలసీదారుల ప్రీమియంకు నూరుశాతం భద్రత ఉంటుందని ఎల్ఐసీ డివిజనల్ (నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాలు) సేల్స్ మేనేజర్ జి.ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరులోని మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న ఓ హోటల్లో ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల నుంచి సేకరించిన ప్రీమియంను ప్రభుత్వ ఆధ్వర్యంలోని రైల్వేలు, రోడ్లు, భారీ పరిశ్రమల్లోనే పెట్టుబడిగా పెట్టే సంస్థ ఎల్ఐసీ అన్నారు. జీవన్ ఉత్సవ్, జీవన్ ఉమాంగ్, అమృత్‌బాల్, జీవన్ ఆనంద్ లాంటి పాలసీలకు పెద్దఎత్తున ప్రజల నుంచి స్పందన రావడం సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి పాలసీల పట్ల ప్రజలకు ఏజెంట్లు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఎండీఆర్‌టీ, ఇతర లక్ష్యాలను సాధించిన ఏజెంట్లను సన్మానించారు. కార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాళెం బ్రాంచ్ మేనేజర్ పెంచలయ్య, డీఓ బాలసుబ్రహ్మణ్యం, పలువురు ఏజెంట్లు పాల్గొన్నారు.

పొగాకు బ్యారెన్ దగ్ధం



కాలిపోయిన పొగాకు

కలిగిరి: కృష్ణారెడ్డిపాళెం పంచాయతీ కుడుములదిన్నెపాడులో పేట వెంకటేశ్వర్లుకు చెందిన పొగాకు బ్యారెన్ ఆదివారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. బ్యారెన్‌లో పొగాకును క్యూరింగ్ చేస్తుండగా గొట్టాలపై ఆకులు పడి మంటలు వ్యాపించాయి. స్థానికుల సమాచారంతో వింజమూరు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. సుమారు రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు. బోర్డు అధికారులు నష్టం వివరాలను నమోదు చేసుకున్నారు.

తోపుడు బండ్లను ఢీకొన్న కారు

నెల్లూరు(క్రైమ్): కారు మితిమీరిన వేగంతో రోడ్డుపక్కనే ఉన్న తోపుడు బండ్లు, స్కూటీని ఢీకొట్టింది. ఈ ఘటన నెల్లూరులోని కేవీఆర్ పెట్రోల్ బంకు సమీపంలో ఆదివారం జరిగింది. సేకరించిన సమాచారం మేరకు.. కస్తూరిదేవి గార్డెన్స్ ఎదురు ఖాళీ స్థలం వద్ద రోడ్డుమార్జిన్‌లో తోపుడు బండ్లపై కొందరు పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం సాయంత్రం ఫత్తేఖాన్‌పేట నుంచి కేవీఆర్ పెట్రోల్ బంకు వైపు కారు మితిమీరిన వేగంతో వస్తూ రెండు పండ్ల బండ్లను, ఒక స్కూటీని ఢీకొట్టి ఆగిపోయింది. వ్యాపారులు, స్కూటీ యజమాని సకాలంలో పక్కకు దూకడంతో ప్రమాదం తప్పింది. ప్రమాదానికి కారణమైన కారు ముందుభాగం దెబ్బతింది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

తల్లీబిడ్డల అదృశ్యం

ముత్తుకూరు: భర్త వైఖరితో మనస్తాపం చెందిన ఓ భార్య తన ఇద్దరు పిల్లలను తీసుకుని అదృశ్యమైన ఘటన కృష్ణపట్నం పంచాయతీలో జరిగింది. ఆదివారం కృష్ణపట్నం ఎస్సై శ్రీనివాసరెడ్డి వివరాలు వెల్లడించారు. ఆర్కాట్‌పాళేనికి చెందిన సురేష్, పామంజి కల్యాణి దంపతులకు లీలా మనోహర్, భార్గవ్ అనే పిల్లలున్నారు. సురేష్ నిరుద్యోగిగా ఉండటం భార్యకు నచ్చలేదు. పుట్టింటి నుంచి తెచ్చిన డబ్బుతో భర్త ద్వారా రొయ్యల పెంపకం చేయాలనుకుంది. కాగా అందులో సగం డబ్బు ఖర్చు కావడం ఆమెను తీవ్ర వేదనకు గురిచేసింది. భర్తపై అలిగి ఇద్దరు పిల్లలను తీసుకుని శనివారం కల్యాణి ఇంటి నుంచి వెళ్లిపోయింది. సురేష్ గాలించినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరులో యువతి

నెల్లూరు(క్రైమ్): ఉద్యోగానికి దరఖాస్తు చేసుకునేందుకు బయోడేటా తయారు చేసుకుని వస్తానని ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైంది. పోలీసుల కథనం మేరకు.. గుప్తా పార్కు ప్రాంతానికి చెందిన యువతి ఉద్యోగాన్వేషణలో ఉన్నారు. బయోడేటా తయారు చేసుకునేందుకు గాంధీబొమ్మ సెంటర్‌కు వెళ్తున్నానని ఆమె ఆదివారం కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుంచి బయటకు వచ్చింది. తిరిగి రాకపోవడంతో కుటుంబం గాలించింది. ఆచూకీ తెలియకపోడంతో సంతపేట పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పీడించండి.. వసూలు చేయండి

- హడలెత్తిస్తున్న మార్కెటింగ్ శాఖ
- సెస్ వసూలు విషయంలో ఉన్నతాధికారుల ఒత్తిళ్లు
- 15 రోజుల్లో రూ.7 కోట్లు ముక్కుపిండి వసూలు
- కూటమి ప్రభుత్వంపై కన్నెర్ర



గోదాము (ఫైల్)

వ్యాపారులు నష్టాల్లో ఉన్నా.. వ్యవసాయంలో లాభాలు రాకపోయినా.. మనకు సంబంధం లేదు. ఆహార ఉత్పత్తులు రవాణా చేసే వారి నుంచి సెస్‌ను ముక్కుపిండి వసూలు చేయాలని జిల్లాలోని మార్కెటింగ్ శాఖ అధికారులకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక సెస్ వసూళ్లంటూ అధికారులు తనిఖీల పేరుతో హడావుడి చేస్తున్నారు.

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో నెల్లూరు, కోవూరు, కావలి, కందుకూరు, రాపూరు, ఆత్మకూరు, ఉదయగిరి, సర్వేపల్లి మార్కెట్ కమిటీలున్నాయి. వాటి పరిధిలో పండించిన వ్యవసాయ ఉత్పత్తులను వివిధ ప్రాంతాలకు సరఫరా చేసేందుకు మార్కెట్ శాఖకు సెస్ చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఏడాది విధించిన లక్ష్యం రూ.34.43 కోట్లు. ఈ నెలాఖరుకు వసూలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

ఏ ప్రాంతాల్లో ఎంతంటే..

నెల్లూరులో రూ.5.13 కోట్లు, కోవూరులో రూ.6 కోట్లు, కావలిలో రూ.3.83 కోట్లు, కందుకూరులో రూ.1.36 కోట్లు, రాపూరులో రూ.46 లక్షలు, ఆత్మకూరులో రూ.1.17కోట్లు, ఉదయగిరిలో రూ.1.18 కోట్లు, సర్వేపల్లిలో రూ.1.49 కోట్ల చొప్పున ఇప్పటి వరకు వసూలు చేసినట్లు తెలిసింది. నెలాఖరు సమీపిస్తున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఒత్తిడితో గత 15 రోజుల్లో సుమారు రూ.7 కోట్ల వరకూ ముక్కుపిండి వసూలు చేసినట్లు సమాచారం.

ఎన్నడూ లేని విధంగా..

సాధారణంగా వ్యవసాయ ఉత్పత్తులు తరలించే వారి నుంచి సెస్ వసూలు చేస్తుంటారు. కూటమి ప్రభుత్వం ముక్కుపిండి వసూలు చేసే విధానానికి తెర తీసింది. ఎన్నడూ లేని విధంగా విద్యార్థులుండే హాస్టల్స్, బేకరీలు, స్వీట్ షాపుల్లో మార్కెట్ శాఖ తనిఖీలు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. హాస్టల్స్‌లో వాడే బియ్యం ఎక్కడి నుంచి తెచ్చారు?, బిల్లు ఉందా?, ఏ మిల్లు నుంచి తెచ్చారు? లేక ఏ రైతు నుంచి కొనుగోలు చేశారనే వివరాలను తెలుసుకుంటున్నారు. నిర్వాహకులు నేరుగా రైతుల నుంచి తీసుకుని కొనుగోలు చేస్తే దానికి సెస్ కట్టారా?, ఆ రైతు వివరాలు ఇవ్వండంటూ బెంబేలెత్తిస్తున్నారు. దీంతోపాటు స్వీట్ షాపులు, బేకరీల్లో తనిఖీలు చేస్తూ మీరు వాడుతున్న స్వీట్స్‌కు జీడిపప్పు, బాదం పప్పు, ఇతర పప్పు దినుసులు ఎక్కడి నుంచి కొన్నారు? తదితరాలను అడుగుతూ ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు.

ఒత్తిడి చేయడంతో..

పనులన్నీ పక్కనపెట్టి సెస్ వసూళ్లపైనే దృష్టి పెట్టాలని ప్రభుత్వం ఒత్తిడి తేవడంతో మార్కెటింగ్ శాఖ అధికారులు, సిబ్బందికి నిద్రాహారాలు కరువయ్యాయి. రాత్రి, పగలు తేడా లేకుండా చెక్‌పోస్టు పాయింట్లలో ఉండి వాహనాలు తనిఖీలు చేస్తున్నారు. టార్గెట్ పూర్తి చేయకపోతే చర్యలు తప్పవని ఉన్నతాధికారులు తెగేసి చెప్పడంతో అధికారులు అష్టకష్టాలు పడుతున్నారు.

నిబంధనల ప్రకారం వసూలు

మార్కెట్ శాఖకు కట్టాల్సిన సెస్ వసూళ్లలో మేం నిబంధనలు పాటిస్తున్నాం. సెస్ కట్టాల్సిన వారి నుంచి తప్పకుండా వసూలు చేసేలా అధికారులు ముందుకెళ్తున్నారు. ఇప్పటికే రూ.20 కోట్ల మేర వసూలైంది. ఈనెల చివరికి టార్గెట్ పూర్తి చేసే పనిలో ఉన్నాం.

– అనితాకుమారి, ఏడీ, జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ